క్లుప్తంగా

టోకెన్ల వారీగా యూరియా పంపిణీ



ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపు వద్ద యూరియా కోసం వచ్చిన రైతులు

కందుకూరు: టోకెన్ల వారీగా పోలీస్ బందోబస్తు మధ్య గురువారం అధికారులు యూరియా పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంతో పాటు ప్రైవేట్ డీలర్ల వద్దకు 780 బస్తాల ఎరువు సరఫరా అయ్యింది. దీంతో ఆయా ప్రాంతాల వద్ద పోలీసుల పహారాలో రైతులకు రెండు బస్తాల చొప్పున గతంలో జారీ చేసిన టోకెన్ల వారీగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏసీపీ జానకీరెడ్డి, సీఐ సీతారామ్ ఆయన పర్యవేక్షించారు. మరో రెండు రోజుల్లో ఇంకా యూరియా రానుందని ఏఓ లావణ్య తెలిపారు.

కందుకూరులో భారీ వర్షం



కురుస్తున్న వాన

కందుకూరు: మండల పరిధిలో గురువారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. ఈ వర్షంతో మొక్కజొన్న, వరి, పత్తి తదితర పంటలకు లబ్ధి చేకూరనుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల ఆవరణలో వరదనీరు



రోడ్డుపై నుంచి పాఠశాల ఆవరణలోకి వస్తున్న వరదనీరు

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడి ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం కురిసిన వర్షానికి వరదనీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే విధంగా నీరు ఆవరణలోకి వచ్చి చేరుతోందని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. మరోపక్క భవనం కూడా శిథిలావస్థకు చేరిందని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆకుల మైలారంలో చాకలి ఐలమ్మకు నివాళి



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారంలో సీపీఎం గ్రామ కార్యదర్శి నోముల నర్సింహ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్, నాయకులు పి.శ్రీరాములు, జి.నర్సింహ, ఆర్.కృష్ణ, కాళిదాస్, శివయ్య, చాకలి రాజు తదితరులు పాల్గొన్నారు.

లెవల్ లేదని.. 100 అడుగులు తవ్వేశారు!

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ సత్యనారాయణ పురం కాలనీ నుంచి ప్రభాత్‌నగర్ కాలనీ పార్కు వరకున్న రోడ్డు గుంతలమయంగా మారడంతో ఏడాది క్రితం నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మంగళవారం రాత్రి 100 అడుగుల మేర ఈ రోడ్డును పూర్తిగా తవ్వేశారు. గమనించిన స్థానికుల సమాచారంతో కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అక్కడకు చేరుకుని సూపర్‌వైజర్ అడగగా సాయినగర్ నుంచి రాఘవ ఆసుపత్రి వరకు నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం జరిగిందని, ఆ రోడ్డుకు ఈ రోడ్డుకు లెవెల్ సరిపోకపోవటంతో తవ్వినట్లు సమాధానం ఇచ్చాడు. ఇదే విషయాన్ని జీహెచ్ఎంసీ ఈస్ట్‌జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా ఇంజినీరింగ్ అధికారులు డీఈ, ఏఈ వచ్చి పరిశీలించారు. బాగున్న రోడ్డును తవ్వి ప్రజాధనాన్ని వృథా చేయటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్లో దళారులు.. రోడ్డుపై రైతులు



సర్వీసు రోడ్డుపై కాయకూరలు విక్రయిస్తున్న రైతులు



రోడ్డుకు ఎదురుగా ఎన్టీఆర్ మార్కెట్

హుడాకాంప్లెక్స్: ప్రజలకు తాజా కూరగాయలను తక్కువ ధరకే అందజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు బజార్లు, కూరగాయల మార్కెట్లలో దళారులు తిష్టవేశారు. అసలైన రైతులు లోపలికి రాకుండా అడ్డుకుంటున్నారు. వారి స్థానంలో వారే దందా చేస్తున్నారు. ఫలితంగా రేయింబవళ్లు శ్రమించి పండించిన కూరగాయల విక్రయానికి సర్వీసు రోడ్డే దిక్కవుతోంది. ఇటు పోలీసులు, అటు పారిశుద్ధ్య కార్మికులతో చివాట్లు పడుతున్నారు. సరూర్‌నగర్, ఎన్టీఆర్‌నగర్‌లలో రైతు బజార్లలో రైతుల దుస్థితి.

దళారుల ఆంక్షలు

హయత్‌నగర్, బాలాపూర్, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం మండలాలకు చెందిన రైతులు తెల్లవారు జామునే ఇక్కడికి తమ పంటలను తీసుకొచ్చి ఆయా మార్కెట్లలో విక్రయిస్తుంటారు. రైతులే స్వయంగా వ్యాపారం చేస్తుండటం, విపణి కంటే తక్కువ ధరకు తాజా కాయగూరలను అమ్ముతున్న నేపథ్యంలో అది నచ్చని దళారులు వారిపై దండెత్తుతున్నారు. రైతులను లోనికి రాకుండా ఆంక్షలు విధించారు.

కష్టమైనా..

దళారులు అడ్డుకోవడంతో చేసేది లేక.. వారంతా తెచ్చిన పంటను సర్వీసు రోడ్డుపైనే విక్రయించాల్సి వస్తోంది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు పెద్దగా సమస్య లేకపోయినా.. ఆ తర్వాత ఆయా మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలు ఉంటాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జాం అవుతుంటుంది. ఇలా సరూర్‌నగర్ స్టేడియం ఎదుట రోజు వందల మంది రైతులు తమ వ్యాపారం కొనసాగిస్తుంటారు. సాయంత్రం వేళ ప్రధాన రహదారి వెంట ఆటోలు బారులు తీరి కన్పిస్తుంటాయి.

తరచూ ఘర్షణలు..

వివిధ ఆటల్లో శిక్షణ కోసం స్టేడియానికి వచ్చే క్రీడాకారులతో పాటు ఉదయాన్నే వాకింగ్ కోసం వచ్చే వారితో ట్రాఫిక్ కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపారం చేసుకోలేక పోతున్నారు. వాహన దారులతో గొడవకు దిగుతున్నారు. 100 నంబర్‌కు ఫోన్ చేస్తున్నారు. తరచూ ట్రాఫిక్ జాం కావడం, అదే పనిగా ఫిర్యాదులు వస్తుండటంతో ట్రాఫిక్ పోలీసులు కూడా చేసేది ఏమి లేక వారిని అక్కడి నుంచి పంపించేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో తరాజులు, కూరగాయల మూటలను వాహనంలో తరలిస్తున్నారు. ఇలా తీసుకెళ్లిన తూకం రాళ్లు, త్రాసులు, కాయకూరల బుట్టలను విడిపించుకునేందుకు ఎంతోకొంత నజరానా ముట్టజెప్పాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

సర్వీసు రోడ్డుపైనే కూరగాయల విక్రయం

- తరచూ ట్రాఫిక్ జాం..
- వాహనదారుల ఫిర్యాదులు
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న పోలీసులు

మార్కెట్లోకి రానిస్తలేరు



ఆకు కూరలు విక్రయిస్తున్న మహిళా రైతు అలివేలు

ఉన్న కొద్దిపాటి భూమిలో ఆకు కూరలు పండిస్తూ జీవనోపాధి పొందుతున్నామని ఇంబ్రహీంపట్నానికి చెందిన మహిళా రైతు అలివేలు తెలిపారు. రోజు ఉదయాన్నే వాటిని మార్కెట్‌కు తెస్తున్నాం. కానీ ఎన్టీఆర్ మార్కెట్లోకి దళారులు అనుమతించడం లేదని పేర్కొంది. చేసేది లేక రోడ్డుపైనే విక్రయిస్తున్నామని, ఎక్కువ సేపు ఉండలేక.. తక్కువ ధరకే దిగుబడిని అమ్ముకోవాల్సి వస్తుందని వాపోయింది. మార్కెట్లోకి పర్మిషన్ ఇస్తే.. అక్కడే వ్యాపారం చేసుకుంటానని చెబుతోంది.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కందుకూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సీనియర్ నాయకులు ఎస్.సురేందర్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సాయిరెడ్డి గూడ, ముచ్చర్ల, ఊట్లపల్లి గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి భయపడుతుందని ఎద్దేవా చేశారు. మరోపక్క రైతులకు యూరియా అందక ఆందోళన చెందుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, వారి పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే సబితారెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఎగిరేలా ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు టి.ఇందిరాదేవేందర్, డీసీసీబీ డైరెక్టర్ పి.ఆనంద్, నాయకులు రామగుప్తా, నర్సింహ, భిక్షపతి, ప్రవీణ్‌నాయక్, కార్తీక్, ప్రకాశ్‌రెడ్డి, పారిజాతం, దీక్షిత్‌రెడ్డి, వెంకటేశ్, దామోదర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గోవర్ధన్, రామకృష్ణ, మోహన్, మహిపాల్‌రెడ్డి, రవి, ఆనంద్, లక్ష్మయ్య, రాజు, మల్లేశ్, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా రాకేశ్ నియామకం



రాకేశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర నాయకుడు రాఘవేందర్ ముదిరాజ్

మహేశ్వరం: ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని వత్తుల రఘుపతి కాంప్లెక్స్‌లో గురువారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు రాఘవేందర్ ముదిరాజ్, రాసాల వినోద్ యాదవ్, మంచాల భిక్షపతి ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా గంటవెళ్లి రాకేశ్, ఉపాధ్యక్షులుగా గుంద్రపల్లి అమరేందర్, అహ్మద్ పాషా, ప్రధాన కార్యదర్శిగా పూజారి లాలయ్యముదిరాజ్, కార్యదర్శులుగా బుడ్డోని మల్లేశ్, మాచోళ్ల దాసు, భవానీశేఖర్, రాము, కోశాధికారిగా నర్సింహ, కార్యవర్గ సభ్యులుగా చెన్నయ్య, మహిపాల్, దప్పు రవీందర్, పెంటయ్య, యాదయ్య, యాదగిరి, జగన్, బలరామ్, అంజనేయులు, మహిపాల్, ప్రదీప్, నాగార్జున, అశోక్, దేవేందర్, రాజు, చెర్కుపల్లి రాములు, మీడియా ఇన్‌చార్జిగా నరేశ్‌ను ఏకగ్రీవంగా నియమించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు కోరారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



మిథాని డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సుల్తాన్‌పూర్ వాసులు, నాయకులు

బడంగ్‌పేట్: గత ఆరు సంవత్సరాలుగా సుల్తాన్‌పూర్ గ్రామం మీదుగా బస్సులు రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ గురువారం గ్రామస్తులు బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మిథాని డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మల్లాపూర్ మీదుగా సుల్తాన్‌పూర్ గ్రామానికి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకొని పహాడీషరీఫ్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, తుక్కుగూడ, కందుకూర్, కడ్తాల్, ఆమనగల్, కల్వకుర్తి వంటి ప్రదేశాలకు ఆర్టీసీ బస్సులను నడిపేదన్నారు. ఆరు సంవత్సరాల నుంచి సుల్తాన్‌పూర్ గ్రామానికి బస్సు రావడం లేదని ఆరోపించారు. కనీసం సుల్తాన్‌పూర్ స్టేజీ వద్ద కూడా బస్‌లు ఆగడం లేదన్నారు. ప్రతి రోజు వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వెళ్లే నిరుద్యోగులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మేనేజర్ దృష్టికి తెచ్చారు. సుల్తాన్‌పూర్ మీదుగా బస్‌లు పునరుద్ధరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ గురుస్వామి స్పందించారు. బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు విచారణ చేస్తామని వారికి హామీనిచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్

కందుకూరు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభను ఆ సంఘం అధ్యక్షురాలు ప్రభావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఏడాదికిపైగా 9, 10 తరగతుల విద్యార్థులకు సంబంధించిన బిల్లులు ఇంతవరకు రాలేదన్నారు. మరోపక్క గౌరవ వేతనం అందడం లేదన్నారు. బహిరంగ మార్కెట్ ప్రకారం గుడ్లకు ధరతో పాటు నిత్యావసర ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచాలన్నారు. ఈ నెల 15వతేదీలోపు పెండింగ్ బిల్లులు మంజూరు కాకపోతే కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నూతన కమిటీని ఎన్నుకొని ప్రకటించారు. అధ్యక్షురాలిగా కె.ప్రభావతి, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా జి.అశ్విని, కోశాధికారిగా బాలమణిని ఎన్నుకున్నారు. అనంతరం ఎంఈఓకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు శేఖర్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని వినాయకహిల్స్-1లో గతంలో పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్డు పనులను ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మంజూరైన రోడ్లను వేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కాలనీవాసుల కష్టాలు తెలుసుకొని రోడ్డు పనులకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. వినాయకహిల్స్ కాలనీ-1కు రోడ్డు పనులు తిరిగి మంజూరు చేయించేందుకు సహకారం అందించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ చిగురింత పారిజాత, మున్సిపల్ కమిషనర్ సరస్వతికి కాలనీసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏదుళ్ల ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, నాగేందర్, రమేశ్, మురళి, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, లింగారెడ్డి ఉన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

సొంత నిధులతో సేవలు అభినందనీయం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని మార్గదర్శి కాలనీ కమ్యూనిటీ హాల్, టెలిఫోన్ కాలనీ పార్కులో వాకర్స్, సీనియర్ సిటిజెన్స్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మధుర ఉపేందర్ రెడ్డి తమ సొంత నిధులతో నిర్మించిన వాష్ రూమ్స్‌ను గురువారం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు కిచెన్న గారి లక్ష్మా రెడ్డి(కేఎల్ఆర్) టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించేవాడు నాయకుడు అవుతాడన్నారు. రాబోయే రోజులలో మరింత విస్తృతస్థాయిలో సేవ చేయడానికి ఉపేందర్ రెడ్డి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్ నేత, బండి మధుసూదన్ రావు, నల్లెంకి ధనరాజ్ గౌడ్, కుంచారపు సురేంద్ర కుమార్, సంజీవరెడ్డి, రమణయ్య, జి. వెంకట్ రెడ్డి, రాములు గౌడ్, మధుసూదన్, యస్. శివలింగం గౌడ్, రామ్మూర్తి, వరాల పుష్పలత మోహన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

మలక్‌పేట: అసంపూర్తి పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ లైన్-5లో పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ క్వార్టర్స్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే దారి కూడలిలో వాటర్ వర్క్స్ మ్యాన్ హోల్ మరమ్మతులకు కోసం రోడ్డును తవ్వి మరమ్మతులు చేపట్టారు. మ్యాన్‌హోల్ నిర్మాణం కోసం తవ్విన మట్టి రోడ్డుపై కుప్పలుగా పోశారు. రోజులు గడిచినా సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించకపోవడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బంజారా బస్తీలో యూఎల్‌సీ అధికారుల సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మలక్‌పేట: సలీంనగర్ తీగలగూడ బంజారా బస్తీ గుడిసెల్లో గురువారం యూఎల్‌సీ విభాగం అధికారులు సర్వే నిర్వహించారు. డీఈ సుబ్రమణ్యం సిబ్బందితో కలిసి గుడిసెలను సందర్శించి గుడిసెవాసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుడిసెవాసులు నివాసం ఉంటున్న స్థలంలో గూగుల్ సర్వే నిర్వహించారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను కలిసి గుడిసెవాసులకు ఇళ్లు మంజూరు చేయించాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు తెలంగాణ దళిత, గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బట్టుదాసురావు, ప్రధాన కార్యదర్శి కొర్ర చందులాల్‌నాయక్ తెలిపారు. 2021లో సైదాబాద్ మండల రెవెన్యూ అధికారులు సోషల్ ఎకానమీ సర్వే(ఎస్ఈఎస్) చేసి 131 మందిని అర్హులుగా గుర్తించారన్నారు. నాలుగేళ్లు గడిచినా పేదలకు ఇళ్లు అందలేదన్నారు. కూలీపనులు చేసుకుని జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. అందుకు ఎమ్మెల్యే స్పందించి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యూఎల్‌సీ అధికారులు సర్వే చేస్తున్నారని, సర్వే పూర్తయి అనంతరం పేదల సొంతింటి కలను సాకారం చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.